క్లుప్తంగా

యువకులపై కేసు నమోదు

అమలాపురం టౌన్: ఒక సినిమా హీరో పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ఏడుగురు యువకులు జీపును అతివేగంతో వెళుతూ ఈదరపల్లి బైపాస్ రోడ్డు (ముక్కామల)లో ఓ కూల్ డ్రింక్ షాపును ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఆ షాపుతో పాటు రెండు మోటారు సైకిళ్లు ధ్వంసమయ్యాయి. ఈనెల 9న జరిగిన ఈ ఘటనపై పట్టణ పోలీసులు అమలాపురం రూరల్ మండలం బండార్లంకకు చెందిన ఆ ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడనప్పటికీ షాపు, రెండు మోటారు సైకిళ్లు దెబ్బతిన్న కారణంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణపతి ఆలయానికి మైక్ సెట్ బహూకరణ

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డీవారి అగ్రహారంలోని బాల విద్యార్థి గణపతి స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన పోతంశెట్టి వెంకట సూర్యనారాయణ ఫణి ప్రసాద్ మైక్ సెట్‌ను సోమవారం అందజేశారు. ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుడు దాసరి రాము దంపతుల చేతల మీదుగా వాటిని కమిటీకి అందజేశారు. తన తండ్రి దివంగత పోతంశెట్టి సత్తిరాజు జ్ఞాపకార్థం మైక్ సెట్‌ను సమకూర్చినట్టు దాత వెంకట సూర్యనారాయణ ఫణి ప్రసాద్ తెలిపారు. ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమెల్లి నాగ సుధాకొండ, నల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

యానాం: నియోజకవర్గ పరిధిలో కనకాలపేటలో కొలువైన గణపతి ఆలయానికి, శుంకరపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయానికి మంగళవారం నాయకుడు తోట రాజు రూ. 2లక్షలు విరాళాన్ని అందించారు. ఆలయాలకు వచ్చిన తోటరాజుకు ఆయా ఆలయాల ప్రతినిధులు స్వాగతం పలికారు.

రూ.లక్ష విరాళం

తాళ్లరేవు: యానాంకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త తోటరాజు కాపులపాలెం అయ్యప్పస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా తోట రాజును ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు.

దాతల సహకారం అభినందనీయం

అల్లవరం: పాఠశాలల్లో అభివృద్ధి పనులకు దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సాయిబాలాజీ చారిటబుల్ ట్రస్టు, ఐఫీడ్ ఆధ్వర్యంలో నిర్మించిన సైకిల్ స్టాండ్, ఆడిటోరియంను ఎమ్మెల్యే ఆనందరావు సోమవారం ప్రారంభించారు. హెచ్ఎం ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లవరానికి చెందిన ఆక్వా యజమాని బండిగుప్తావు పాండురంగ సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడేలా రూ.4 లక్షలతో సైకిల్ స్టాండ్ నిర్మాణం, రూ.7 లక్షలతో ప్లాట్ ఫారం నిర్మించారని, నెక్సాజెన్ ఫీడ్ ప్రైవేటు కంపెనీ ఆర్థిక సహకారంతో రూ.7.5 లక్షలతో ఆడిటోరియం నిర్మించినట్టు తెలిపారు. అనంతరం పాండురంగ, నెక్సాజెన్ కంపెనీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, శేషును ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ మానిక, డాక్టర్ వరహాలు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ, నడింపల్లి సూర్యానారాయణరాజు, కంకిపాటి వీరబాబు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలు అభినందనీయమని సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్ అన్నారు. సమనస పంచాయతీలో పని చేసి బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగుల సత్కార సభ సోమవారం నిర్వహించారు. ఆరేళ్లుగా ఉద్యోగులు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు, పాలకవర్గ సభ్యులు చంటిరాజు, కార్యదర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రూరల్ మండలం ఎ. వేమవరప్పాడు రైతు భరోసా కేంద్రంలో సోమవారం యూనియన్ సమావేశం నల్లా వెంకటసతీష్‌కుమార్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, అమలాపురం ఉమ్మడి డివిజన్ నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆర్ఎస్ఎస్ సూరప రాజు, జిల్లా అధ్యక్షుడిగా గుంట్రూ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మోరం వెంకయ్యనాయుడు, ట్రెజరర్‌గా బొంతు శ్రీఫణి, కార్యదర్శిగా పెద్దిరాజు వేమలరావు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురం డివిజన్ అధ్యక్షుడిగా అక్కిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా యడ్ల రాజేంద్రప్రసాద్, ట్రెజరర్‌గా కోలా నాగప్రసాద్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎ. వేమవరప్పాడు గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన గెడ్డం మురళీబాబు మృతికి యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు. మురళీబాబు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

తీరంలో అక్రమ తవ్వకాలు

- యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక దందా
- ఇసుక తవ్విన ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా ఆక్వా సాగు
- చోద్యం చూస్తున్న మైన్స్, రెవెన్యూ శాఖాధికారులు



ఓడలరేవు సముద్ర తీరం సీఆర్‌జెడ్ పరిధిలో తవ్విన అనధికార చెరువులు

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఏడు కిలోమీటర్ల పొడవున ఉన్న సముద్రతీర ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. సముద్ర తీర గ్రామాలు ఓడలరేవు, కొమరగిరిపట్నం, నక్కా రామేశ్వరంలో నిరుపేదలకు పంపిణీ చేసిన డీ పట్టా భూముల్లో అక్రమార్కులు ఇసుక తవ్వకాలకు తెర తీశారు. తీరం పొడవునా ఆక్వా చెరువుల ముసుగులో ఇసుక అక్రమ దందా కొంత కాలంగా సాగుతోంది.

గుట్టుచప్పుడు కాకుండా..

తీరం ప్రాంతం.. అందునా సరుగుడు తోటలు అడ్డుగా ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టారు. డీ పట్టా భూములను అక్రమార్కులు లీజుకు తీసుకుని రాత్రి వేళల్లో జేసీబీలు, పొక్లెయిన్ల సాయంతో ఇసుకను తవ్వి రవాణాకు అనుగుణంగా ఉండేందుకు గుట్టలుగా పోస్తున్నారు. అనంతరం తవ్విన ఇసుక క్షేత్రాలను చెరువులుగా మార్చుకుని నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగు చేపడుతున్నారు. ధనార్జనే లక్ష్యంగా అక్రమ ఇసుక రవాణా, అనధికార ఆక్వా సాగు చేపట్టి జేబులు నింపుకుని ప్రయోజనాలు పొందుతున్నారు.

సరుగుడు తోటలు కనుమరుగు

తీరం పొడవునా ఇసుక తవ్వకాలతో తీరానికి రక్షణగా ఉన్న సరుగుడు తోటలు పూర్తిగా కనుమరుగయ్యాయి. వందల ఎకరాల్లో తీరానికి రక్షణగా ఉన్న సరుగుడు తోటల స్థానంలో నేడు అనధికార ఆక్వా చెరువులు పుట్టుకొచ్చాయి. సీఆర్‌జెడ్ పరిధిలో 500 మీటర్ల లోపునా తీర ప్రాంతంలో ఏలాంటి తవ్వకాలు చేయరాదని నిబంధనలున్నా ఆక్వా యజమానులు, ఇసుకాసురులు ఏ మాత్రం ఖాతరు చేయకుండా దందా సాగిస్తున్నారు.



రాత్రివేళల్లో తరలించేందుకు సిద్ధం చేసిన సముద్ర ఇసుక

ఫిర్యాదులను పట్టించుకోలేదు



తీరం పొడవునా సీఆర్‌జెడ్ పరిధిలో ఇసుక తవ్వకాలపై ఇటీవల కలెక్టర్, ఆర్డీఓ, అల్లవరం తహసీల్దార్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. పర్యావరణానికి హాని కలిగించే తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– యెల్లమిల్లి రామారావు, కొమరగిరిపట్నం, అల్లవరం మండలం

రాత్రి వేళల్లో ఇసుక రవాణా

తీరంలో తవ్విన ఇసుకను రాత్రి వేళల్లో ట్రాక్టర్లపై అక్రమ రవాణా చేస్తున్నారు. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాలకు సముద్ర ఇసుకను రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరైనా ఒక ట్రాక్టర్ ఇసుక తరలిస్తే రెవెన్యూ, పోలీసులు, మైన్స్ అధికారులు కాపు కాచి వాహనాలను సీజ్ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే నాథుడు కరువయ్యారు. అక్రమ ఇసుక రవాణాపై తీర ప్రాంత ప్రజలు సమాచారం ఇచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మైన్స్ అధికారులైతే మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే ప్రయత్నం మైన్స్ అధికారులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

భూ, గోమాతలను కాపాడుకోవాలి



పి.మల్లవరం వ్యవసాయ క్షేత్రంలో మూల ముహూర్తం చేస్తున్న రైతు వెంకటరమణ

తాళ్లరేవు: భూమాత, గోమాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పి.మల్లవరం కృషి అమృత్ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం రైతు ధూళిపూడి వెంకటరమణ తెలిపారు. సోమవారం వ్యవసాయ క్షేత్రంలో తొలకరి పంట ఊడ్పుల కోసం సంప్రదాయ పద్ధతిలో మూల ముహూర్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి ఆహారం అందించాలన్న తపనతో దేశీయ విత్తనాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రైతు రసాయనాల ఖర్చు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని, ప్రకృతి సిద్ధంగా కషాయాలు పంటలపై వినియోగించాలని అన్నారు. ఈ సందర్భంగా నారు శుద్ధి చేసేందుకు బీజామృతాన్ని తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు దడాల సత్తికొండ, నేతల నాగార్జున, వైసీఆర్‌పీ బత్రాజు వెంకటలక్ష్మి, నిమ్మకాయల మూర్తి, బల్ల చిరంజీవి, దున్నా మహేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం



క్యూఆర్ కోడ్ పత్రాలను చూపిస్తున్న పిన్నమరాజు వెంకటపతిరాజు, మాత మురళి తదితరులు

ఐ.పోలవరం: బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారంటీ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని, ఒకటి రెండు పథకాలు ఇచ్చినా అర్హులను తొలగించి మోసం చేశారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు అన్నారు. ఐ.పోలవరం మండల కేశనకుర్రులో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం వెంకటపతిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోర్తా రాణి మరియం జ్యోతి, నియోజకవర్గ పరిశీలకులు మాత మురళి, పార్టీ నాయకులు ఇందుకూరి రంగరాజు, మోకా రవితోపాటు పార్టీకి చెందిన ఎంపీటీలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవుకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో రోడ్డుపై ఉన్న ఓ ఆవును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ నాయకులు, కార్యకర్తలు తక్షణమే స్పందించి మృతి చెందిన ఆవును ఖననం చేసే ఏర్పాట్లు చేశారు. కారు డిక్కీలో చనిపోయిన ఆవును ఎక్కించి స్థానిక బైపాస్ రోడ్డులోని శ్మశానవాటికకు తీసుకుని వెళ్లి ఖననం చేశారు. గొయ్యి తీసేందుకు లింగోలు పండు జేసీబీని సమకూర్చారు. శాస్త్రోక్తంగా పూజలు చేసి సంప్రదాయబద్ధంగా రాత్రి 11.30 గంటలకు చనిపోయిన చనిపోయిన ఆవును ఖననం చేశారు. భజరంగ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు ఊటుకూరి సాంబయ్య, కొప్పాడి రాము, యక్కల బ్రహ్మేష్, మేడిశెట్టి సతీష్, కర్రి పార్థసారధి, బల్ల సాయి కృష్ణ, పసుమర్తి సుమన్ పాల్గొన్నారు.



ఆవును ఖననం చేసేందుకు కారు డిక్కీలోకి ఎక్కిస్తున్న భజరంగ దళ్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

ఉప్పలగుప్తం: స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో లేక ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒక బాలుడిపై పిచ్చికుక్క దాడి చేస్తే హెమోగ్లోబిన్ ఇంజక్షన్ ఇవ్వడానికి సిబ్బంది లేక భీమనపల్లి పీహెచ్‌సీకి తరలించారన్నారు. ఏదైనా అత్యవసరంగా ఆపద వస్తే బాధితులు నానా అవస్థలు పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. 24 గంటలు వైద్య సేవలందించాల్సిన ఈ ఆస్పత్రి రోగులకు అక్కరకు రావడం లేదు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి.తులసీ కృష్ణ, వైద్యాధికారి ఎల్.నాగార్జునకు అర్జీ అందించారు. కార్యక్రమంలో చిక్కం వరప్రసాద్, చిక్కం రాము, చిక్కం సూర్యమోహన్, ఆకుల సూర్యనారాయణమూర్తి, సుందరనీడి సతీష్, మోకా సూరిబాబు, శిరంగం శ్రీనువాస్, గంగుమళ్ల పండు, ఆకుల దుర్గబాబు, చిక్కం సాయిపవన్, సలాది తాతారావు పాల్గొన్నారు,



ఉప్పలగుప్తం తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేస్తున్న గ్రామస్తులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ అధికారి జి.మమ్మీ తెలిపారు. ఈ శిబిరానికి అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు మండలాల నుంచి 106 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా మమ్మీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా సహిత విద్యలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్యాంపులో దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అమలాపురం మండలం నుంచి 18 మంది, అల్లవరం మండలం నుంచి 46, ఉప్పలగుప్తం మండలం నుంచి 20, మామిడికుదురు మండలం నుంచి 22 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి మమ్మీతో పాటు జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంపీవీ సత్యనారాయణ, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను సేకరిస్తున్న సర్వ శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ అధికారి మమ్మీ

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలతో ఎస్సీ వర్గీకరణ చేసి మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని అమలాపురంలో కలెక్టరేట్ వద్ద మాలమహానాడు నాయకులు ధర్నా నిర్వహించారు. మాల మహానాడు జేఏసీ జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు నాయకత్వంలో 5 లక్షల మంది ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో సచివాలయాన్ని ముట్టడించినప్పుడు అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మాలలపై జరిపిన ధమనకాండలో ప్రాణాలు కోల్పోయిన పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ, మెండి సత్యరామ్‌కు మాల మహానాడు జేఏసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు జేఏసీ నాయకులు పెయ్యల శ్రీనివాసరావు, పెనుమాల చిట్టిబాబు, గిడ్ల వెంకటేశ్వరరావు, సాపే బాలరవి, పడమట రాంప్రసాద్, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, కాశి వెంకట్రావు, రొక్కాల నాగేశ్వరరావు, గెద్దాడ బుద్ధరాజు, దాసరి నాగేశ్వరరావు, బుడితి సోమరాజు పాల్గొన్నారు.



కలెక్టర్ వద్ద ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

జీఓ 5 రద్దుచేసి ఎస్సీల సంక్షేమాన్ని కాపాడాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం జారీచేసిన జీఓ 5కు వ్యతిరేకంగా రద్దు కోరుతూ సోమవారం యానాం రీజియన్‌కు చెందిన వందలాది మంది దళితులు చలో పుదుచ్చేరి కార్యక్రమంలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరమ్ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఆర్ఏఓ గిడ్డి బలరాం ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. విష్ణుమూర్తి మాట్లాడుతూ సుమారు 16 డిమాండ్లకు సంబంధించి ముఖ్యమైన అంశాలను వివరించారు. ఆది ద్రావిడ శాఖ ద్వారా జారీ చేసిన జీఓ వల్ల ఎస్సీల సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణం దానిని ఉపసంహరించుకోవాలని కోరారు.అనంతరం సీఎం రంగసామిని కలిసిన పలువురు దళితులు జీఓ 5 వల్ల కలిగే నష్టాలను వివరించారు. 16 డిమాండ్లను నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటామని సీఎం రంగసామి హామీ ఇచ్చారు. ఎల్జీ కైలాసనాథన్‌ను మంగళవారం రాజ్ నివాస్‌లో కలవనున్నట్లు ఆందోళనకారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు న్యాయవాది కమిడి విజయకుమార్, పువ్వల వెంకట్రావు, తిరుకోటి నాగేశ్వరరావు, మట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రంగసామికి సమస్యలు వివరిస్తున్న దళిత సంఘ నేతలు

ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలి

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ భక్తిని చాటాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. స్థానిక హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు జాతీయ జెండాలను చేతపట్టి హర్ ఘర్ తిరంగా గురించి వివరించారు. జాతీయ జెండాలను వారు ప్రదర్శించి స్వాతంత్ర్య దినోత్సవ రోజైన ఈనెల 15వ తేదీ వరకూ ప్రజలు తమ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించి జాతీ సమైక్యతను, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు విజ్ఞప్తి చేశారు. హర్ ఘర్ తిరంగా జోనల్ ఇన్‌చార్జి నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

అల్లవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు సూచించారు. మన జెండా మన గౌరవం నినాదంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లవరం ఎంపీడీఓ లక్ష్మణరావు ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి అల్లవరం సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీఓ నాగేంద్ర, కార్యదర్శులు, వీఆర్వోలు, పాల్గొన్నారు.



అల్లవరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషణ

అమలాపురం టౌన్: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషణ లభిస్తుందని వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరావు అన్నారు. మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చల్లా వారి వీధిలో అర్బన్ హెల్త్ సెంటరులో సోమవారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. వాకర్స్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ నాగేశ్వరావు ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలకు పోష్టకాహార కిట్లను పంపిణీ చేశారు. మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, క్లబ్ ప్రతినిధులు పి.లలిత, ఎస్. లక్ష్మీదేవి, వాకర్స్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నలుగురు యువకుల అరెస్టు



చెయ్యేరులో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసిన ఈగల్ టీమ్, పోలీసులు

కాట్రేనికోన: చెయ్యేరులో ఈగల్ టీమ్‌తో కలసి పోలీసులు దాడి చేసి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురిని అరెస్టు చేశామని కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం చెయ్యేరు ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ ఆదేశాలతో ఈగల్ టీమ్ సభ్యులతో కలసి దాడి చేశామన్నారు. గంజాయి సేవిస్తున్న వాసంశెట్టి సోమేశ్వరసాయి పవన్, పలివెల కార్తీక్, ముసలి తేజస్వరూప్, మోకా సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 400 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి ముమ్మిడివరం కోర్టులో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించామని ఎస్సై అవినాష్ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద హార్టికల్చర్ విద్యార్థుల నిరసన

అమలాపురం రూరల్: రామచంద్రపురంలో జేకేపీపీ హార్టికల్చర్ యూనివర్సిటీలో ఆగస్టు 2024 డిప్లొమా ఇన్ హార్టికల్చర్ రెండేళ్ల కోర్సులో అడ్మిషన్ తీసుకొని మొదటి సంవత్సరం పూర్తి చేశామని, ద్వితీయ సంవత్సరం నుంచి బాలురకు తరగతులు రద్దు చేసి ఇతర ప్రాంతాల్లో చదవడానికి బదిలీ చేశారంటూ విద్యార్థులు కలెక్టర్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువును కొనసాగించేందుకు కళాశాలకు వెళ్లగా ప్రిన్సిపాల్ సీహెచ్ చిన్నబ్బాయి 8 మందిని ఈ విద్యా సంవత్సరంలో చదువు నిమిత్తం నూజివీడు బ్రాంచ్‌కు బదిలీ చేసినట్లు రామచంద్రపురం కళాశాలను మహిళా కళాశాలగా మార్పు చేసినట్లు తెలిపారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నూజివీడు వెళ్లి ఫీజు కట్టి ద్వితీయ సంవత్సరం అక్కడే చదువుకునే పరిస్థితి లేదని పిల్లి ఆనంద్‌కిషోర్‌తోపాటు ఏడుగురు విద్యార్థులు వాపోయారు. హాస్టల్ వసతి లేకుండా రామచంద్రపురం కాలేజీలో డే స్కాలర్‌గా ఈ సంవత్సరం చదువును కొనసాగించేందుకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

కొబ్బరి చెట్ల వివాదంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారంలో అప్పర్ కౌశిక్, పుంత స్థలంలోని కొబ్బరి చెట్లను కొందరు అన్యాయంగా ఆక్రమించి పొందుతున్న ఫల సాయాన్ని తిరిగి గ్రామ పంచాయతీకి అప్పగించాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అప్పర్ కౌశిక్‌కు ఆనుకుని 70 చెట్లు, పుంతలో 400 కొబ్బరి చెట్లు ఉన్నాయని, వీటిని మద్దింశెట్టి నాగమణి, మద్దింశెట్టి తేజ అన్యాయంగా ఆక్రమించుకుని ఫలసాయాన్ని పొందుతూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లేటప్పటికీ పరిష్కారం కాలేదని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఉప సర్పంచ్ యర్లగడ్డ వెంకట్రావు, పేరబత్తుల నాగభూషణం, ముత్తాబత్తుల సత్యవతి, కేతా లక్ష్మి, గ్రామస్తులు మొరపెట్టుకున్నారు.

28 మందికి ఉద్యోగాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 28 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. హైదరాబాద్ ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ఈ జాబ్ మేళాను నిర్వహించింది. నల్లా చారిటబుల్ ట్రస్ట్, రిలయన్స్ ఫౌండేషన్, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళాలో దాదాపు 100 మందికి పైగా నిరుద్యోగులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ వార్షిక జీతాలు ఉంటాయని ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ప్రతినిధులు తెలిపారు. నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్ కుమార్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఈవో కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత గొడవల కారణంగా ఇద్దరిపై దాడి

అమలాపురం రూరల్: బండారులంకలో పాత గొడవల కారణంగా ఇద్దరు వ్యక్తులపై 11 మంది దాడి చేశారు. అరటి మామిడితోటలో పాత గొడవల కారణంగా అదే ప్రాంతానికి చెందిన వాసంశెట్టి లక్ష్మి ఇంటిపై ఇళ్ల సత్యగోపాలకృష్ణ అనే వ్యక్తి బీర్ సీసా వేశాడన్న ఆరోపణపై ఆదివారం సాయంత్రం వివాదం మొదలైంది. వివాదం ముదరడంతో పెద్దల వద్ద పంచాయతీ పెట్టారు. సమస్య పరిష్కారం కాకుండానే ఇళ్ల సత్యగోపాలకృష్ణపై ప్రత్యర్థివర్గం ఒక్కసారిగా దాడికి దిగింది. గొవ్వాల సతీష్, దొమ్మేటి మహేష్, గొవ్వాల నాగేంద్ర, గొవ్వాల నరేంద్ర, గొవ్వాల చైతన్య, గొవ్వాల అరుణ్‌కుమార్, గొవ్వాల వెంకన్న, గొవ్వాల సత్తిబాబు, గొవ్వాల ఏసుబాబు, దొమ్మేటి షణ్ముఖరావు, వాసంశెట్టి లక్ష్మి కలసి సత్యగోపాలకృష్ణపై దాడి చేశారు. అడ్డువచ్చిన గోపాలకృష్ణ తాత గుత్తుల బాబూరావుపై దాడి చేసి గాయపర్చారు. ఈ విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడ్డ సత్యగోపాలకృష్ణ, బాబూరావు అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్సై తెలిపారు. గోపాలకృష్ణ, బాబూరావు ఫిర్యాదు మేరకు 11 మందిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తాలూకా ఎస్సై శేఖర్ బాబు తెలిపారు. గోపాలకృష్ణ దాడి చేశారని వాసంశెట్టి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.